విశాలాంధ్ర కృష్ణా జిల్లా

చిరువ్యాపారులకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలో జగనన్న తోడుతో చిరువ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న తోడు 8వ విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలోని కలెక్టరేట్ విసి హాలు నుండి పాల్గొన్న వర్చువల్ విధానంలో పాల్గొన్న కలెక్టర్ ముఖ్యమంత్రితో మాట్లాడుతూ జిల్లాలో జగనన్న తోడుతో బ్యాంకుల ద్వారా అనుసంధానమై లబ్ధి పొందిన చిరు వ్యాపారుల్లో ఎంతో నమ్మకం పెరిగి మంచిగా వ్యాపారం చేసుకోవడానికి మార్గం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పామర్రు శాసనసభ్యులు పేర్ని వెంకటరామయ్య(నాని), కైలే అనిల్ కుమార్, కేడీసిసి బ్యాంకు చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టీ. జమల పూర్ణమ్మ, ముడా చైర్పర్సన్ బొర్రా వెంకట కనకదుర్గ నాగ లక్ష్మీ భవాని, నగర మేయరు చిటికెన వెంకటేశ్వరమ్మ ఉపమేయర్లు మాడపాటి విజయలక్ష్మి శీలం భారతి రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్షాద్ నజరానా డి ఆర్ డి ఎ పి డి పిఎస్ఆర్ ప్రసాద్ స్థానిక నాయకులు పేర్ని కృష్ణమూర్తి మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉమ్మడి పోరులో పెరుగుతున్న అభ్యర్థులు

-అవనిగడ్డ సీటు ఏ పార్టీకి దక్కేనో..... ?

-రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయకులు చూపంత అవనిగడ్డ పైనే

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసేన, తెలుగుదేశం పార్టీలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గం నుండి జనసేన పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. తెలుగుదేశం, జనసేన పార్టీలు గత సంవత్సరం అక్టోబర్ నెలలో రాజమండ్రి జైలును కేంద్రంగా చేసుకుని జనసేన, టిడిపి కలిసి పోటీ చేస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించిన నాటి నుండి అభ్యర్థుల సంఖ్య చాంతాడులా పెరుగుతూ ఆశావాహులు రోజురోజుకు పెరుగుతున్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ స్థాపించిన నాటి నుండి జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా రాయపూడి వేణుగోపాలరావు ఎన్నో కార్యక్రమాలు చేస్తూ పార్టీని గ్రామ గ్రామీణ అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. గత 4 సంవత్సరాలుగా జిల్లా పార్టీ ఉపాధ్యాక్షులు మత్తి వెంకటేశ్వరరావు, గత 2 సంవత్సరాలుగా మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని మరింత ప్రతిష్ఠం చేయగా, జిల్లా పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ పార్టీ కోసం అహర్నిసలు శ్రమిస్తూ, నియోజకవర్గ శాసనసభ్యునిగా అవకాశం కల్పించాలని కోరుతూ ఉండగా 10 నెలల క్రితమే ఏ అవకాశం ఉన్న నేను పోటీలో ఉంటానంటూ గుడివాక కూడా ప్రకటించడం ఇదే స్థాయిలో ఎవరికి వారు చాపక్రింద నీరు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాన్ సమక్షంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు బిసి నాయకులు చిలకలపూడి పాపారావు అవనిగడ్డ అసెంబ్లీ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆ నాటి నుండి గ్రామస్థాయిలో అట్టడుగు వర్గాల వారిని కలుపుకుంటూ ముందుకు వెళ్తుండగా వేకనూరు గ్రామానికి చెందిన అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకట కృష్ణ (క్రిస్టియన్) పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా జనసేన తీర్థం తీసుకుని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ టిక్కెట్ నాదే అంటూ ముందుకు వెళ్తున్నారు. ఇదే కోవలో మరికొంత మంది ఆశావాహులు జనసేన వైపే మొగ్గుచూపుతున్నారు. అవనిగడ్డ 1 వ వార్డుకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనివాస్ అర్థబలం, అంగబలం ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర, కేంద్ర స్థాయి నాయకులతో జనసేన వైపు మొగ్గుచూపుతూ పావులు కదుపుతున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, టిడిపి, జనసేన పొత్తులో భాగంగా అవనిగడ్డ శాసన సభ్యత్వం టిడిపికే కేటాయిస్తారని టిడిపి అభ్యర్థిగా నేనే పోటీలో ఉంటానంటూ ఇప్పటికే నియోజకవర్గాన్ని పలుమార్లు చుట్టుముట్టి, గత సంవత్సర కాలంగా రైతాంగ సమస్యలపై అలుపులేని పోరాటం కొనసాగిస్తున్నారు. చివరి క్షణాల్లో అవనిగడ్డ హల్వా ఎవరు దక్కించుకుంటారో వేచి చూడాలి మరి.

'ఎస్మా' దారుణం

అంగన్వాడీల సమస్యలు శాంతియుతంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : గత 31 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలు శాంతియుతంగా పరిష్కరించాలని సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ అన్నారు. గురువారం సిపిఎం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నందు ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు వారి ప్రాథమిక హక్కులైన కనీస వేతనం, సుప్రీంకోర్టు ఆదేశానుసారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చేస్తున్న సమ్మెను, 26 రోజుల తర్వాత ఎస్మా ప్రయోగించి అణచివేయాలను కోవడం దారుణమని, ఎస్మా ప్రయోగించాలంటే వారిని ముందుగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అలా చేయకుండా గౌరవ వేతనం ఇస్తున్న వారిపై ఎస్మా ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. అంగన్వాడీలు ఏమి గొంతెమ్మ కోరికల కోరడం లేదని జగన్మోహన్ రెడ్డి పక్క రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తాను అని గతంలో వారికి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని మాత్రమే అడుగుతున్నారని, దానిని అమలుపరిచి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. లేనిపక్షంలో వామపక్ష పార్టీ లు అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని రాష్ట్ర బంద్ ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రఘు, సిపిఎం పట్టణ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, నాయకులు సిహెచ్ రాజేశ్వరరావు, సిహెచ్ జయ రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గౌరీశెట్టి నాగేశ్వరరావు, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం కిషోర్ కుమార్, చంద్రపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్, టి ఎన్ టి యు సి నాయకులు పంచపర్వాల కాశీ విశ్వనాథం, సీపీఐ ఎంఎల్ నాయకుడు వెంకట్రావు, అంగన్వాడీ జిల్లా నాయకులు రమాదేవి, రెజీనా, పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-చల్లపల్లి : పూర్వవిద్యార్థుల సంఘం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. చల్లపల్లి ఎస్సార్ వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో చల్లపల్లి రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్, చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రం సహకారంతో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్. తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, రెడ్ క్రాస్ కృష్ణాజిల్లా చైర్మన్ డాక్టర్ టిఎస్ఎస్.బాలాజీ, సెక్రటరీ భవిరి శంకరనాథ్ లు శిబిరాన్ని సందర్శించి పర్యవేక్షించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలను అభినందించారు. పూర్వవిద్యార్థుల సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, పూర్వవిద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు టి.సాంబశివరావు, అధ్యక్షులు గోవిందరాజుల అశ్వినీకుమార్, కార్యదర్శి బీడీఆర్.ప్రసాద్, ప్రతినిధులు అడ్డాడ ప్రసాద్ బాబు, ఉప్పల నాంచారయ్య, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎం. డిఎకె.జిలానీ, పెనుమూడి శ్రీనివాసరావు, జన్ను నాంచారయ్య, వాసిరెడ్డి రాకేష్, చేతన్, పోతురాజు, మణికాంత్, సుభాషిణి, యర్రంశెట్టి లెనిన్, పెనుమాక రోహిత్, మోపిదేవి ఐఆర్పీఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, నారంశెట్టి వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ రాజులపాటి తాండవకృష్ణ, బీఎస్ఎన్ఎల్.నరసింహారావు, ఆకురాతి హరిప్రసాద్ తదితరులు పాల్గొని రక్తదానం చేశారు. మచిలీపట్నం డాక్టర్ పట్టాటి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ కె.వి.శివప్రసాద్ సిబ్బందితో కలిసి వచ్చి రక్తదాతల నుంచీ 31 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

జూదాలు ఆడితే కఠిన చర్యలు : డీఎస్పీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : డివిజన్ పరిధిలో జూద క్రీడలకు ఏ విధమైన అనుమతులు లేవని, ఆడితే కఠిన చర్యలు ఉంటాయని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ఏ విధమైన పేకాట, గుండు ఆట, కోడి పందాల తరహా చిత్తులాట, పేకాట వంటి జూద క్రీడలు నిర్వహించిన, ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో జూద క్రీడలు నిర్వహించే వారిపై తగు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్, అవనిగడ్డ, నాగాయలంక ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం : కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- అంగన్వాడి కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ,టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి కే సాధ్యమని పెడన నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ ,జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల సురేష్ అన్నారు .బంటుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె గురువారం నాటికి 31 వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతు పెడన నియోజకవర్గ టిడిపి ,జనసేన పార్టీ ఇంచార్జ్ లు కాగిత కృష్ణప్రసాద్ ,పంచకర్ల సురేష్ లు దీక్ష శిబిరంలో కూర్చున్నారు. అనంతరం అంగన్వాడి కార్యకర్తలకు రూ.10 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ శిబిరంలో పార్టీల నాయకులు కూనపురెడ్డి వీరబాబు, ఇల్లూరి లీలాకృష్ణ, కూనసాని చిన్న, అంగర రంగనాథ్, అట్లూరి రమేష్ బాబు, బొర్ర ఖాసి, ఎం డి నజీర్, మాజేటి శివశ్రీనివాసరావు, గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఆకునూరి రత్నకుమార్ తదితరులు మద్దతు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి సచివాలయ సిబ్బంది నివాళి

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్రప్రభుత్వం పర్యవేక్షణలో విజయవాడలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ఆవిష్కరించిన సందర్భంగా గ్రామాలలో ప్రభుత్వ ఆదేశానుసారం" సామాజిక సమతాదివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మొవ్వ మండలంలోని కోసూరు, నిడుమోలు గ్రామపంచాయతీలలో గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి ఎం. ఎన్ఎస్.మూర్తి ఆధ్వర్యంలో గురువారంఅంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతకాల ఉద్యమాన్ని కొనసాగించి ప్రతిజ్ఞలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలలోసర్పంచ్.లు పెనుమూడి రమేష్(కోసూరు),కొమరగిరిఅంజలి(నిడుమోలు), వైస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు అలాగే మొవ్వ అంబేద్కర్ నగర్లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీడీవో జి సుధాప్రవీణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి వీర్ల సీతారామరాజు, గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి కే సోమేశ్వరరావు, ప్రభుత్వ బాలుర హాస్టల్ అధికారి జి శామ్యూల్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఏ మహేష్, తదితరులు పాల్గొన్నారు. ఈనెల 19న పండగ వాతావరణంగా నిర్వహించే అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ప్రజలను కోరారు.

జాతీయస్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : ఎన్‌టిఆర్ టు వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. గురువారం స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), అయన సోదరుడు చిన్నిలు ప్రతి సంవత్సరం నిర్వహించే ఎడ్ల బండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎండ్ల, కోడి పందాలు, ముగ్గుల పోటీలను నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. అనతరం ప్రదర్శనలో పాల్గొన్న పశుపోషకులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎంపిపి గద్దే పుష్పరాణి, నాయకులు పాలేటి చంటి, పాలడుగు రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : సీఎం జగన్మోహన్ రెడ్డి బీసీలకు ఏం అభివృద్ధి చేశారో? శ్వేత పత్రం విడుదల చేయాలని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో మోసపు మాటలు, బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క సామాజిక వర్గానికి న్యాయం చేయలేదని, ముఖ్యంగా రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు తెలుగుదేశం హయాంలో ఉన్న పథకాలను రద్దు చేసి బీసీల అభ్యున్నతికి అడ్డుకట్ట వేశారని అన్నారు, కేవలం రెడ్డి సామాజిక వర్గానికి మాత్రమే కొమ్ము కాస్తూ బీసీమంత్రులకు కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వక పోవడమే కాక తూతూ మంత్రంగా బీసీ కార్పొరేషన్ లకు చైర్మన్ లను నియామకం చేసి నిధులు ఇవ్వకుండా వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసు బాబు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి లంకే శేషగిరి, పట్టణ అధ్యక్షులు ఇలియాస్ భాష, ప్రధాన కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, జిల్లా మహిళా అధికార ప్రతినిధి పాలపర్తి పద్మజ, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచె నాని, కార్పొరేటర్లు కార్యకర్తలు, పాల్గొన్నారు.

23వ రోజుకు రిలే దీక్షలు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : ప్రజల హక్కులను కాలరాసే ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ (భూ హక్కు చట్టం) యాక్ట్ నెంబర్ 27 ఆఫ్ 2023 వెంటనే రద్దు చేయాలని రాష్ట్రంలోని.. న్యాయవాదుల సంఘాలు పిలుపుమేరకు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా నేటి ఉదయం న్యాయవాదులు బార్ అసోసియేషన్ హాలు ముందర ప్రజల హక్కులను కాలరాసే ఆంధ్రప్రదేశ్ నూతన భూ హక్కు చట్టం రద్దు చేసే వరకు రాష్ట్రమంతా నిరసనలు కొనసాగుతాయని సంఘ అధ్యక్షులు తుంగల హరిబాబు అన్నారు, ప్రధాన కార్యదర్శి కొట్టి రఘురాం ఉపాధ్యక్షుడు మట్టా సుబ్బారావు తదితర సీనియర్ జూనియర్ న్యాయవాదులు ప్రజల హక్కులకు భంగం వాటిల్లే మరియు ఈ చట్టం వల్ల ప్రజల ఆస్తిపాస్తులకు జరిగేటువంటి నష్టంపై అవగాహన కలుగజేయడం కోసం పట్టణంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి తెలియజేయడం జరిగింది . ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ జూనియర్ న్యాయవాదులు మరియు సహచర మహిళా న్యాయవాదులు పాల్గొనడం జరిగింది.

అంగన్‌వాడీల దీక్షకు టీడీపీ మద్దతు

విశాలాంధ్ర-పెదపారుపూడి : నియోజకవర్గ కేంద్రమైన పామర్రు సెంటర్లో అంగనవాడి కార్యకర్తలు, వర్కర్లు గత 31వ రోజులుగా చేస్తున్న నిరసన సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యలమంచిలి రాజేంద్రప్రసాద్, ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా లు దీక్షా శిబిరాన్ని దర్శించి తమ పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటించినట్లు అంగనవాడి కార్యకర్తల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు కె రత్నశ్రీ, పెదపారుపూడి ఆ సంఘం అధ్యక్షురాలు జ్యోతి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి

విశాలాంధ్ర-కూచిపూడి : తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్పందించి చర్యలు చేపట్టాలని మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ సిబ్బంది కోరుకొన్నారు. ఈ సందర్భంగా మొవ్వలోని ముఖ్యమంత్రి తండ్రిగారైన డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పత్రాలు అందజేసి వేడుకొంటూ ఆయన మనసు మార్చాల్సిందిగా కోరారు. దీనిలో భాగంగానే నిరవధిక సమ్మె, నిరసన దీక్షలు కొనసాగిస్తున్న 31వ రోజైన గురువారం ఆటపాటలతో దీక్షా శిబిరంలో తమ నిరసనలను వ్యక్తపరిచారు.. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి కరీముల్లా, కృష్ణాజిల్లా కవులు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వికాస్ రెయిన్‌బో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గుడివాడ : వికాస్ రెయిన్‌బో స్కూల్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం సాంప్రదాయక ఆటల పోటీలు నిర్వహించారు. వికాస్ రెయిన్‌బో స్కూల్‌లో విద్యార్థులు రంగు రంగుల రంగువల్లులు, సంక్రాంతి పాటలు పాడి, భోగి మంటలు, గంగిరెద్దుల సన్నాయి వాయిద్యాలు, ముత్యాల ముగ్గులు, గుమ్మడిపూలు, గొబ్బిళ్ళు, చిన్నారుల ఆనందోత్సాహాలు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణల మధ్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పి.రామచంద్రశేఖర్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో సృజనాత్మకను వెలికి తీసేందుకు ముగ్గులు పోటీలు

విశాలాంధ్ర-గన్నవరం : మహిళల్లో సృజనత్మకను వెలికి తీసేందుకు ముగ్గులు పోటీలు దోహదపడుతుందని సర్పంచ్ కొలుసు సముద్రవేణి అన్నారు. సంక్రాంతి సందర్భంగా గురువారం విజయవాడ రూరల్ మండలం గూడవల్లి గ్రామంలో సర్పంచి కొలుసు సముద్ర వేణి ఆధ్వర్యంలో ముగ్గుల పొట్టిలో నిర్వహించారు. ఈ పోటీలో 22మంది మహిళలూ పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ ,తృతీయ విజేతలకు గిఫ్టులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొలుసు సముద్రవేణి, కార్యదర్శి జి మస్తానరావు, గ్రామ వైసిపి కన్వనర్ కొలుసు వేణు గోపాల్, యంపిటిసి గుంటక ప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

నీతి నిజాయితీలకు నిలువుటద్దం లాల్ బహదూర్ శాస్త్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మంచి కంటే చెడు ఎక్కువగా ప్రచారం పొందుతున్న వర్తమానంలో నేటి తరం మరచిన లాల్ బహదూర్ శాస్త్రి గురించి ఆయన పోరాట పటిమ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. భారత రత్న అవార్డు గ్రహీత, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్ర భారతదేశంలో ఆహార కొరతను అధిగమించి దేశాన్ని సస్యశ్యామలం చేయాలని పంజాబ్, హరియానా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలో ఆహార ఉత్పత్తిని పెంచి భారతదేశాన్ని వ్యవసాయ రంగంలో స్వయంగా నడిపించిన లాల్ బహదూర్ శాస్త్రి దూరదృష్టి ఎంతో గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో వెండి, బంగారం ఆభరణాల తనిఖీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : లక్ష్మీనారాయణ స్వామి, రాజశేఖర స్వామి, లంకమ్మ అమ్మవారి ఆలయాలకు చెందిన వెండి, బంగారు ఆభరణాలు గురువారం ఆలయాలకు సంబంధించిన అసిస్టెంట్ కమిషనర్ ఎ.వి దుర్గా భవాని తనిఖీ చేశారు. అన్ని రకా ఆభరణాలను స్వయంగా పరిశీలించి తూకం వేసి సరి చూసుకున్నారు. సహాయంగా అప్రైజర్ శ్రీనివాసరావు వ్యవహరించగా, ఆభరణాల భద్రత విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు దుర్గా భవాని ఆలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో దేవాలయాల నిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు, అర్చక స్వాములు దివి వెంకట రామాచార్యులు, వేణుగోపాలచార్యులు, అప్పలాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో 'కూడారై' వ్రతం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో ధనుర్మాసం 26వ రోజు సందర్భంగా గురువారం కూడారై వ్రతాన్ని నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు. ముముక్షుజన పీఠాధిపతి ముత్తేవిగౌరకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆ ఆశ్రమంలో జరిగిన ధనుర్మాస వేడుకలను,108 శేర్ల బియ్యంతో తయారుచేసిన పొంగలిని తీసుకోవటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఈ వేడుకలో పాల్గొనటానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కూడా వాహనాల్లో భక్తులు తరలిరావడం విశేషం! కాగా మండలంలోని కూచిపూడి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి దేవాలయం, పెదపూడి, మొవ్వ, బార్లపూడి, భట్ల పెనుమర్రు, పెదసనగల్లు, నిడుమోలు, చినముత్తేవి, పెదముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి వారి దేవాలయం, కోసూరు, కాజ, కొండవరం తదితర గ్రామాలలోని వైష్ణవాలయాలలో కూడారై వ్రత పూజలు నిర్వహించారు.

బీసీలకు తీవ్ర అన్యాయం : బొడ్డు

విశాలాంధ్ర-పెడన : రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలన మొదలు పెట్టినప్పటి నుండి బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావువిమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన స్వగృహంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలనలో బీసీ నేతలకు గాని, ప్రజలకు కానీ గౌరవం లేకుండా పోయిందని సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి, సాయి రెడ్డిల పెత్తందారులు ముందు వైసీపీకి చెందిన బీసీ నాయకులు బానిసలుగా ఉన్నారని అన్నారు. జగన్ నా ఎస్సీ, నా బిసి, నా మైనారిటీ అంటూ అన్ని బలహీనవర్గాలను వాడుకుని వదిలేస్తున్నారని వేణుగోపాలరావు అన్నారు. చేనేత వర్గానికి చెందిన కర్నూలు ఎంపీ డాక్టర్ సంజయ్ ని బలి పశువు చేశారని, సీఎం జగన్ బీసీ వర్గాలకు చెందిన ఎంపీలకు ఎమ్మెల్యేలకు మంత్రులకు కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని అన్నారు. రాబోవు ఎన్నికల్లో అనేకమంది బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు వైసిపి పార్టీని వీడనున్నారని వైసిపి రాక్షస పాలనకు ప్రజా కంటక పాలనను అంతమొందించడం తథ్యం అని అన్నారు.రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల కూటమి ప్రజల్లోకి వెళుతుందని, ప్రజల ఆధారణతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, అన్ని సామాజిక వర్గాల సంక్షేమంతో పాటు ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటం ఖాయమని వేణుగోపాలరావు అన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రికి కుమార్‌రాజా నివాళి

విశాలాంధ్ర-పెదపారుపూడి : భారత దేశ మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఎమ్మార్వో కార్యాలయ సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతి, నిజాయితీకి, నిస్వార్థానికి, మరో పేరు లాల్ బహదూర్ శాస్త్రి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పామర్రు పట్టణ శాఖ అధ్యక్షుడు పరస సుబ్రహ్మణ్యం, నాయకులు దాలిపర్తి ప్రసాద్, గోపాలకృష్ణ, లక్ష్మణ రాజు, శివ నాగేశ్వరరావు, శివరామకృష్ణ, సందీప్, నాయి బ్రాహ్మణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెడన నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఉప్పాల రాము

విశాలాంధ్ర-పెడన : వైసీపీ అధ్యక్షులు, సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెడన అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఉప్పాల రాము నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదలైంది.

వెళ్లిపోదాం లూప్‌లైన్‌లోకి...!

- ఎన్నికల బదిలీలను తప్పించుకునేందుకు కొందరు సీఐల ప్రయత్నాలు
- ఎస్‌బీ, సీఎంఎస్, సీసీఆర్‌బీ, సీటీసీ విభాగాలకు వెళ్లేందుకు ప్లాన్
- ఇప్పటికే ఎన్టీఆర్ కమిషనరేట్ నుంచి 20 మంది బదిలీ..
- అప్పటి నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేసిన కొందరు సీఐలు
- ఎలాగైనా కమిషనరేట్ నుంచి కదలకూడదని పట్టు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: కుదిరితే ఎస్‌బీ.. లేకపోతే సీఎంఎస్... అదీ సాధ్యం కాకపోతే సీసీఆర్‌బీ.. సీటీసీ... ఎక్కడైనా ఫర్వాలేదు... ఎన్నికలు ముగిసేవారకు లూప్ లైన్‌లో ఉందాం.. అంతేగాని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ నుంచి కదలకూడదు.. ఇదీ కొందరు సీఐల పరిస్థితి. ఇందుకనుగుణంగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా నాలుగు రోజుల కిందట ఎన్నికల బదిలీల ప్రక్రియ ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ కమిషనరేట్ నుంచి తొలి విడతగా ఆరుగురు స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సహా 20 మంది సీఐలను ఏలూరు రేంజ్‌కు పంపారు. ఇక్కడికి ఆరుగురిని బదిలీ చేశారు. వారు వచ్చి రిపోర్టు చేసిన తర్వాత పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

ఎలాగైనా ఇక్కడే ఉండాలని...

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఒకే ప్రాంతంలో మూడేళ్లుగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాల్సి ఉంది. అయితే, పోలీసు శాఖకు సంబంధించి స్పెషల్ బ్రాంచ్ వంటి కొన్ని విభాగాలకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విజయవాడ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కొందరు సీఐలు ఈ ఎన్నికల బదిలీలను కూడా తప్పించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. తమకున్న అన్ని పరిచయాలను ఇందుకోసం వినియోగించుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం సెంట్రల్ జోన్ పరిధిలోని మూడు స్టేషన్లు ఉండగా, ఒక సీఐని బదిలీ చేశారు. దీంతో మరో సీఐ ఎలాగైనా ఎస్‌బీలోకి వెళ్లాలని గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. విజయవాడకు ఎస్ఐగా వచ్చిన ఆయన ఇక్కడే సీఐగా ప్రమోషన్ పొందారు. తప్పని సరి బదిలీ అయినప్పుడు మాత్రమే ఆయన విజయవాడకు సరిహద్దుగా ఉన్న కృష్ణా జిల్లాకు చెందిన ఓ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. మళ్లీ కొద్దిరోజుల్లోనే విజయవాడ వచ్చేశారు. ఇప్పుడు ఏలూరు రేంజ్‌కు వెళ్లేందుకు ఆయన ఏమాత్రం ఇష్టపడటం లేదని సమాచారం. ముందుగానే ఎస్‌బీలోకి వెళ్లి ఎన్నికల బదిలీల నుంచి తప్పించుకోవాలని ఆయన తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. సౌత్ జోన్ పరిధిలో ఉన్న మూడు స్టేషన్ల హౌస్ ఆఫీసర్ల (సీఐలు)ను బదిలీ చేశారు. నార్త్ డివిజనులో మూడు స్టేషన్లకు గానూ ఒక సీఐ బదిలీ అయ్యారు. మరొక సీఐ జిల్లా నుంచి కొత్తగా వచ్చారు. ఆయనను బదిలీ చేసే అవకాశం లేదని తెలిసింది. వెస్ట్ డివిజన్ పరిధిలో నాలుగు స్టేషన్లకు గానూ ఒక సీఐని బదిలీ చేశారు. ఇక్కడ కూడా సిటీకి దూరంగా ఉన్న ఒక సీఐ కూడా ఎస్‌బీకి వెళ్లాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఎస్‌బీ కుదరకపోతే ఇతర ప్రాధాన్యతలేని విభాగాల్లో అయినా పోస్టింగ్ ఇస్తే చాలు అని పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు రూరల్ ప్రాంతంలో ఉన్న మరో నలుగురిలోనూ ఒక సీఐ కూడా ఎన్నికల బదిలీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఇప్పుడు ఎస్‌బీలో ముగ్గురు సీఐలు ఉండగా, వారిలో ఇద్దరిని బదిలీ చేయించి అయినా తాము అక్కడికి వెళ్లాలని రెండు స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కేంద్ర ఎన్నికల కమిషన్ విజయవాడలో రెండు రోజులు ఐఏఎస్, ఐపీఎస్‌లతో సమావేశాలు పెట్టి మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో బదిలీలు పారదర్శకంగా చేస్తారా.. లేక పైరవీలను పట్టించుకుంటారా... అనేది చర్చనీయాంశంగా మారింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, కోరుతూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవాని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, వంకాయలపాటిరాణి గురువారం మహిళా శిశు సంక్షేమ అధికారి జి.జయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీరు మాట్లాడుతూ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు వెంటనే ఉద్యోగాల్లో చేరకపోతే తొలగిస్తామని బెదిరిస్తున్నారని, పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని, అనేక ఇబ్బందులు పడుతూ మరో గత్యంతరం లేక సమ్మె చేస్తున్న అంగన్వాడి లపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి అంగన్వాడీల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని, బెదిరింపు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

బేషరతుగా కార్మికుల సమ్మె విరమణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మున్సిపల్ కార్మికుల 16 రోజులుగా కొనసాగుతున్న సమ్మె బేషరతుగా విరమించామని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు అన్నారు. గురువారం దాసరి భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు ఏ ఆర్ ఆంజనేయులు, నగర గౌరవాధ్యక్షులు జె జేమ్స్, నగర నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలపై గత నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించగా ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి డిమాండ్స్ నిరాకరించిన నేపథ్యంలో డిసెంబర్ 28 నుండి కార్మికులంతా సమ్మె బాటపట్టి, 16 రోజులుగా పలు రూపాలలో నిరసనలు చేపట్టిన దరిమిలా ప్రభుత్వము కార్మికుల ఐక్య ఉద్యమాల తీవ్రతను అర్థం చేసుకొని గురువారం సాయంత్రం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రజా వ్యవహారాల శాఖ అధికారి శ్రీలక్ష్మి మరియు ఇతరుల సమక్షంలో కార్మిక సంఘ జేఏసీ నేతలతో చర్చలలో డ్రైవర్స్, క్లీనర్స్ కు రూ 6 వేలు పెంచి, స్కిల్, సెమిస్కిల్, హైస్కిల్ లను ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కమిటీ ద్వారా మూడు క్యాటగిరి లను డివైడ్ చేసి తగురీతిలో న్యాయం చేస్తామని, ప్రతి ఉద్యోగికి యూనిఫామ్, పండగలోపు రూ వెయ్యి ఇస్తామని, ముందుగా లిఖితపూర్వక హామీ, మూడు రోజుల్లోపు జీవో విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్మికుని పదవి విరమణ సందర్భంగా రూ 75 వేలు, చనిపోయిన కార్మికుని కుటుంబానికి మట్టిఖర్చుల నిమిత్తం రూ 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం విజ్ఞప్తులతో జేఏసీ నాయకులు చర్చలు పరిశీలించిన పిదప, సమ్మె కాలంలో నగరంలో పెరిగిపోయిన చెత్త, మరో ప్రక్క కోవిడ్ కేసులు, వస్తున్న పండుగలు, నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ విజ్ఞప్తిమేరకు బేషరతుగా సమ్మె విరమిస్తున్నామన్నారు. కార్మికులంతా గురువారం మధ్యాహ్నం హాజరుకావాలని సమాచారం అందించామన్నారు. ప్రభుత్వం కార్మికుల కోర్కెలు అంగీకరించి ఉపశమనం కలిగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవో విడుదల చేసి, న్యాయం చేయని పక్షంలో కార్మికులంతా మరలా ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు.

పేదల న్యాయవాది ఎంజే రాయ్

విశాలాంధ్ర-విజయవాడ : పేదల పక్షాన నిలిచి తలలో నాలుకలా వారికి తోడుగా న్యాయ సహాయ సహకారాలు అందించిన ఎంజే రాయ్ న్యాయవాదులకే ఆదర్శంగా నిలిచారని సీపీఐ నాయకులు బుట్టి రాయప్ప అన్నారు. ప్రముఖ న్యాయవాది మర్రి జోసెఫ్ రామ్(ఎంజే రాయ్) ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఐ 34వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చింతమళ్ల రాముడు యువజన గ్రంథాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రాయప్ప మాట్లాడుతూ తన వద్దకు న్యాయం కోసం వచ్చే వారికి సహాయపడాలని రాయ్ పరితపించే వారని తెలిపారు. గుర్తు చేశారు. చివరకు ఆర్థికంగా తన జేబులో నుంచి ఖర్చు చేయాలన్నా వెనుకాడేవారు కాదన్నారు. పార్టీ ఆదర్శాలను పాటిస్తూ స్థానిక యువతీ యువకులతో స్నేహభావంతో వ్యవహరించే వారని గుర్తు చేశారు. ఆయన మార్గంలో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని రాయప్ప చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి కాళ్ల చిన్నప్ప, సహాయ కార్యదర్శులు దొడ్డా కుమార్, కాళ్ల విజయ్, సీహెచ్.వెళంగణమ్మ, బుట్టి లత, గోసు దినమ్మ, కాళ్ల ప్రకాశరావు, కాళ్ల థామస్, ద్విజేంద్ర కామల్, జి.ప్రసాద్, జి.రాముడు, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

20న ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా మహాసభ ఈ నెల 20వ తేదిన నిర్వహించనున్నట్లు మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. ఈ మహాసభ నిర్వహణపై సబ్ కమిటీ సమావేశం గురువారం స్థానిక దాసరిభవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఈ మహాసభ దాసరి భవన్‌లో 20వ తేది శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించటం జరుగుతుందన్నారు. కళాకారులు నైపుణ్యాన్ని పొందించుకోవాలని సూచించారు. కొత్త కళాకారులను ప్రజాన్యామండలిలోకి ఆహ్వానించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సరికొత్త బాణీలలో పాటలు రూపొందించాలన్నారు. ఎన్నిక సమయంలో ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా ప్రదర్శన చేయటానికి అవసరమైన ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి విజయవాడ నగర కన్వీనర్ లంక దుర్గారావు, గౌరవాధ్యక్షులు కేవీ భాస్కరరావు, అధ్యక్షులు ఎస్‌కే.నజీర్, కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, నాయకులు భాష, కాళ్ల చిన్నప్ప, రాము పాల్గొన్నారు.

మేటి ధారణాశక్తి వాగ్దాటి తుర్లపాటి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : పాత్రికేయునిగా భారత ప్రభుత్వం నుంచి పద్మ పురస్కారాన్ని అందుకున్న మొట్టమొదటి పాత్రికేయుడు, కళాపోషకుడు, కళాప్రియుడు, సామాజిక, సాంఘిక ఆలోచన పరుడు, సమయాన్ని పాటించే మహోన్నతుడు అపార ధారణాశక్తి కలిగిన వాగ్దాటి తుర్లపాటి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, కృష్ణ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో తుర్లపాటి వర్ధంతి సభ గురువారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగింది. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో ముఖ్య ఆత్మీయ అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, డాక్టర్ కె వేణుగోపాలరెడ్డి, సిపిఎం నాయకులు సిహెచ్ బాబురావు, అంబటి మధుమోహనకృష్ణ తదితరులు మాట్లాడుతూ భేషజం లేకుండా నిరాడంబరంగా జీవించిన వ్యక్తి తుర్లపాటి అని అన్నారు. పాత్రికేయ రంగానికి ఆయన ఆదర్శప్రాయుడని అన్నారు. కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి, చెట్లపల్లి మారుతీ ప్రసన్న, తటవర్తి సూర్యనారాయణ, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు అతిథులుగా పాల్గొని తుర్లపాటి వారి గొప్ప వ్యక్తిత్వాన్ని, కర్తృత్వాన్ని కొనియాడుతూ ప్రసంగించారు.

మాధుర్యాన్ని పంచిన చిత్ర గీతాలాపన

అదే వేదికపై పావని, మాధవి, శ్రావణి, కామేశ్వరి, హరికృష్ణ, చంద్రశేఖర్, వెంకట్, డేవిడ్ రాజు, మస్తాన్ వలి లు అందమె ఆనందం, ఎక్కడ ఉన్నా ఏమైనా, ఈ జీవన తరంగాల్లో, నన్ను ఎవరో ఆపిరి, నా సరి నీవని, నిన్న లేని అందమేదో, నీలో నేనై వంటి ఇత్యాది పాటలను రసభరితంగా పాడి వినిపించారు.

వాంబే కాలనీలో చోరీ

ఆటో డ్రైవర్ ఇంట్లో 5 కాసుల బంగారం, రూ.40వేలు నగదు అపహరణ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం) : ఆటో డ్రైవర్ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉండాల్సిన ఐదు కాసుల బంగారం అభరణాలు, రూ.40వేలు నగదును దోచుకున్నారు. ఈ ఘటన గురువారం విజయవాడ పాయకాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వాంబేకాలనీ బ్లాక్ నంబర్ 291కు చెందిన ఉప్పలపాటి రాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుంది. భార్య పనికి వెళ్లగా ఉదయం ఆటో డ్రైవర్ తన పిల్లలను తీసుకుని బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టివుంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన ఐదు కాసుల బంగారం అభరణాలు, రూ.40వేలు నగదు చోరీకి గురైంది. మేరకు బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకుని పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు అడుతున్న ఐదుగురి అరెస్టు

రూ.4వేలు నగదు, రెండు కోళ్ళు, కోడి కత్తి స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ రూరల్ పరిధిలో తుమ్మలపాలెం గ్రామంలో కోడి పందేలు అడుతున్న నలుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4వేలు నగదు, రెండు కోళ్లు, కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని శివాలయం సమీపంలో కోడి పందేలు వేస్తున్నారని వచ్చిన సమాచారంతో ఇబ్రహీపట్నం పోలీసులు కోడి పందేలు నిర్వాహకులపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు.

చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం

విశాలాంధ్ర-వీరులపాడు: ఎన్నికల నేపథ్యం లో తెలంగాణ సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిఘా తీవ్రతరం చేసినట్లు ఏసిపి జనార్దన్ నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం పెద్దాపురం చెక్ పోస్ట్ వద్ద ఏసిపి జనార్దన్ నాయుడు వాహన తనిఖీలు నిర్వహించారు.

వడ్డే ఓబన్న జయంతి

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామం లో గురువారం షిరిడి సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో మొదటి తరం స్వాతంత్ర్యసమరయోధులు వడ్డే ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 18వ శతాబ్ద కాలంలో సైరా నరసింహారెడ్డి తో కలిసి బ్రిటీష్ వారిని గడగడలాడించిన ఓబన్న గొప్ప దేశభక్తి పరుడని విశ్రాంత ఎంఈఓ. వి.శేషిరెడ్డి తెలిపారు. సాయిబాబా సేవా కమిటీ సభ్యులు వడ్డెర సంఘం ప్రతినిధులను నూతన వస్త్రాలు కప్పి సన్మానించారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటాన్ని, జాతీయ జెండాలు పట్టుకొని వడ్డెర సంఘం సభ్యులు గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పెనుగొలను, ఊటుకూరు గ్రామాలకు చెందిన వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు షటిల్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

విశాలాంధ్ర-వీరులపాడు: సంక్రాంతి పండుగ ను పురస్కరించుకొని, వీరులపాడు మండలం జుజ్జూరు కేంద్రం లో మేడుకొండూరు హనుమంతరావు మెమోరియల్ షటిల్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల జనవరి 12 నుండి 14 వరకు నియోజకవర్గ స్థాయి లో నిర్వహిస్తయిన్నట్లు తెలిపారు. ఈ టోర్నీ ని ఎంఎల్‌ఏ మొండితోక జగన్మోహనరావు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి తక్షణం నిలుపుకొవాలని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం,రాష్ట్ర అధ్యక్షులు,స్ట్రగుల్ కమిటీ అధ్యక్షులు స్వచ్ఛంద ప్రసాద్, డిమాండ్ చేశారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు వ్యవస్థలోనే మగ్గిపోతున్న నర్సింగ్ అధికారుల సంక్షేమం కోసం, వారి భవిష్యత్తు ఉన్నతంగా ఎదగడం కోసం గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట్రంలో ఉన్న నర్సింగ్ సంఘాలన్నీ ఒకే వేదిక మీదకు రావటం జరిగిందన్నారను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ లో ఉన్నటువంటి నర్సింగ్ అధికారులు అందరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయాలన్నారు. మాకు వ్యత్యాసాలు చూపించవద్దని, అందరికీ సమానంగా రెగ్యులర్ చేయాలని, మావి న్యాయమైన డిమాండ్లు అని త్వరలోనే కార్యాచరణ ప్రకటించి ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలి బత్తిన శ్రీనివాస్,సూర్య సుమన్,ఎం. చిన్నారి,తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీ ల సమ్మె

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహాసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు 31వ రోజుకు చేరాయి. గురువారం అంగన్వాడీలు మరియు హెల్పర్స్ ఒకో రోజు ఒకో తీరున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్వీటీ జిల్లా కమిటీ సభ్యులు బి రాము, ప్రజాసంఘాల నాయకులు కోట కష్ణ ,అంగన్వాడి యూనియన్ నాయకులు టి మధుకుమారి, అంజమ్మ, విశాలాక్షి, సువర్చల, రత్నకుమారి, లక్ష్మీ, మేరి, లీల జానమ్మ, ఉమారాణి, ఖాజాబి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

కేశినేని నాని వెన్నుపోటు దారుడు : టీడీపీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : కేశినేని నాని టీడీపికి వెన్నుపోటు దారుడని మండల టీడీపీ నాయకులు అన్నారు. రెడ్డిగూడెం టీడీపీ మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుపై అనుచిత మైన వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. కేశినేని నాని కోసం పార్టీ రెండు సార్లు పార్లమెంటు సీటు కేటాయించి పార్లమెంటుకు పంపిందని కాని కేశినేని నాని చంద్రబాబునాయుడుపై తప్పుడు మాటలు మాట్లాడటం తప్పని అన్నారు. వేరే పార్టీలోకి వెళ్లేందుకు కేశినేని నాని ప్రణాళిక సిద్ధం చేసుకొని టీడీపీ పార్టీని దెబ్బతియటానికే సిద్ధపడి గొడవ చేసి బయటకు వెళ్లడం సిగ్గు చేటు అని అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు బొమ్మిన కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ జానాలపాటి వేణుగోపాలరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చాట్లా చందా, రాయుడు వెంకటేశ్వరరావు, పోతురాజు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకద్రోహం గురించి మాట్లాడే అర్హత నీకుందా..? : కొండ్రగుంట

విశాలాంధ్ర-వీరులపాడు: చంద్రబాబుపై కేశినేని నాని చేసిన వ్యాఖ్యలు హేయంఅని, దేయ్యాలు వేదాలు వల్లె వేసినట్లు వుందని టిడిపి వీరులపాడు మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్ అన్నారు. వీరులపాడు మండలం జుజ్జూరులో గల మండల టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నువ్వు పార్టీ నుండి వెళ్ళిపోయిన ఎవ్వరికీ ఇబ్బందిలేదని, టిడిపి పార్టీ అనేది బలమైన నాయకులను తయారు చేసే ఫాక్టరీ అని, నాయకులకు,కార్యకర్తలకు కొదవులేదని కేశినేని నాని ని ఉద్దేశించి ఆయన అన్నారు. ఈ సమావేశంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చీదిరాల భరత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరబాబు, మండల తెలుగు యువత నిమ్మల రాజేంద్ర,కోడెల కుటుంబరావు,మల్లెల మాధవరావు,ఎస్సి సెల్ నాయకుడు ఏసుబాబు, ఎర్రంరెడ్డి పెద్ద అబ్బాయి, నందిగామ ఐ టిడిపి శేషు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో విజయవాడ నగరానికి 3వ ర్యాంకు : మంత్రి ఆదిమూలపు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు చేసిన ప్రశంసనీయమైన కృషికి స్వచ్ఛ సర్వేక్షన్-2023 ఏపీకి 3 ర్యాంకులు వచ్చినట్లు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు వేడుకలుల్లో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించినందుకుగాను గృహ నిర్మాణ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి, సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ మరియు మిషన్ డైరెక్టర్ రూప మిశ్రా చేతుల మీదుగా మంత్రి సురేష్, విజయవాడ నగర మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 3 నగరాలకు జాతీయస్థాయిలో టాప్ టెన్‌లో 3 ర్యాంకులు దక్కాయని, దేశంలో ఏ రాష్ట్రానికి దక్కని ఘనత విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలు దక్కినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో కేవలం నాలుగు నగరాలు టాప్-10లో ఉంటే అందులో రాష్ట్రానికి 3 ర్యాంకులు రావటం విశేషమన్నారు. మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగమైన స్వచ్ఛ సర్వేక్షన్ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం చేసే సర్వేలో భాగంగా నగరాల పరిశుభ్రత, పాటించే పరిశుభ్ర పద్ధతులు ఆధారంగా నిర్ణయించే ర్యాంకుల్లో నగరానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు రావటం విశేషమన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు వేడుకల్లో వీఎంసీ అదనపు కమిషనర్ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, నందిగామ

ఓ.ఎస్.నెం. 20/2021

దేవవరపు సూర్యనారాయణ - వాది

మరియు

1. గొల్లపూడి రామతారకం
2. గొల్లపూడి రాజేష్ (రోళ్ళపూడి రాజేష్), తండ్రి అప్పారావు, హెచ్.నెం. 1-23, సత్యనారాయణపురం, విజయవాడ.
3) బోడిపాటి చైతన్య, తండ్రి అప్పారావు, హెచ్.నెం.1-23, సత్యనారాయణపురం, విజయవాడ.

పై నెంబరు గల దావాలో, 2,3 ప్రతివాదులకు, పై కోర్టువారినుంచి, సమన్లు పంపిననూ, తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, పై కోర్టువారి ఉత్తర్వుల మేరకు, సదరు పై దావాలో 2,3 వారల హాజరు నిమిత్తం ది. 22-1-2024న వాయిదా అయివున్నది. కావున వాయిదా రోజున మీరు, 2,3 వారలు పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30ని॥లకు హాజరుకాగలరు. లేనియెడల మీ పరోక్షమున పై దావా విచారించబడును.

వాయిదా తేది : 22-11-2024

మన్నెం నారాయణరావు, అడ్వకేట్ & నోటరీ, సెల్ : 9490952102.

నందిగామ, తేది : 10-1-2024.

దుగ్గి చెన్నారెడ్డికి నివాళి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రెడ్డిగూడెం మండలానికి చెందిన కమ్యూనిస్టుపార్టీ నేత దుగ్గి చెన్నారెడ్డి మృతికి మండల సీపీఐ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు చెన్నారెడ్డి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కమ్యూనిస్టుపార్టీ రెడ్డిగూడెం మండలంలో చేసిన పోరాటాల్లో చెన్నారెడ్డి పాత్ర చిరస్మరణీయమని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

జయంతిలో వికసిత్ భారత సంకల్ప యాత్ర

విశాలాంధ్ర-వీరులపాడు: పేద వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యసాధనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత సంకల్ప యాత్ర ప్రారంభించారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు మండలం జయంతి గ్రామంలో వికసిత్ భారత సంకల్ప యాత్ర లో భాగంగా ప్రచార రథాన్ని గురువారం ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరైన గ్యాస్ సిలిండర్లను ఆమె అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన పేదవర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(పీఎంజేఏవై) ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో అరుంధతీ దేవి,గ్రామ సర్పంచ్ మారపాక మహాలక్ష్మి,ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు జంగా కోటిరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత వేమిరెడ్డిపల్లి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో గురువారం జరిగిన మండల స్థాయి వాలీబాల్ క్రీడల్లో వేమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచినట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలువురు యువకులు ఈ క్రీడల్లో పాల్గొనగా, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వీటిని నిర్వహించారు.

కొనసాగిన అన్నసమారాధన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్ జయంతిని పురస్కరించుకుని విస్సన్నపేటలో బుధవారం నుంచి చేపట్టిన అన్నసమారాధన గురువారం కొనసాగింది. రెండవరోజు దాతలుగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి శ్రీనివాసరావు, డా.వీర్ల కిరణ్ వ్యవహరించగా, పలువురు క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలోని తెల్లదేవరపల్లిలో అధికారులు గురువారం ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. గ్రామంలోని 400మంది మహిళలకు వీటిని అందజేసినట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఇండేన్ గ్యాస్ ఏజన్సీ డీలర్ పులపాక శ్రీనివాసరావులు తెలిపారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా వీటిని అందజేశామని వారు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా నాయకులు తేనేటి ఇమ్మానియేల్, పులపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విజయవాడ

O.S.N0.1079/2020.

పిటీషన్ :
కెనరా బ్యాంక్, మధునగర్ బ్రాంచి, మొగల్రాజపురం, విజయవాడ .. వాది

మరియు

మజ్జి నరేష్ ...ప్రతివాది

టు

ప్రతివాది
మజ్జి నరేష్, S/O. రామమోహనరావు, డోర్ నెం. 23-31-15, కొమ్మువారి వీధి సత్యన్నారాయణపురం, విజయవాడ-520 011, ఎన్.టి.ఆర్.జిల్లా.

నా క్లయింటు పైనెంబరు దావాలో ప్రతివాదికి న్యాయస్థానం ద్వారా నోటీసులు పంపిననూ, వారు సదరు నోటీసులు అందుకోకుండా బుద్ధి పూర్వకంగా న్యాయస్థానమునకు హాజరుకావటంలేదు. ప్రతివాది హాజరు నిమిత్తం ది.23.01.2024వ తేదీన పై దావా వాయిదా అయివున్నది. కావున ప్రతివాది ది.23.01.2024 న ఉదయం 10.30 గంటలకు పైన న్యాయ స్థానమునందు ప్రత్యక్షముగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టునందు హాజరై తమ అక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల దావా పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ. 23.01.2024.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

యం. జ్ఞానాంబ, అడ్వకేట్, ఫ్లాట్ నెం.406, జి.జె.యం.ఆర్. రెసిడెన్సీ, జి.వి.ఆర్. నగర్, విజయవాడ-520 003 సెల్ నెం. 9440183394

విజయవాడ, తేది. 11 .01.2024.

IN THE COURT OF THE 2nd ADDL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA

I.A.No.209/2022 in I.A.No.544/2018 in O.S.No. 704/2015

Between :-
Ramineni Satyanarayana ..... Petitioner/ Defendant
And
Thotakura Sambasiva Rao and another ....Respondents

To.
Respondent No.1 :-
Thotakura Sambasiva Rao S/o.(late) Nageswara Rao Hindu, aged about 50 years, R/o.Nidamanuru Post, Vijayawada Rural Mandal, Krishna District.

Please take notice that the above petition is posted to 07/02/2024 for your appearance and so that you are notice to appear before the court on that day at 10.30.A.M. Else the petition will be decided in your absence.

Court Adjournment date:- 07/02/2024

Bevara Atchuteswar, Gundu Gangadhar, Advocates for Plaintiff, Vijayawda

Vijayawada: Dt. 09/01/2024

క్రీడలు పోటీతత్వాన్ని పెంచుతాయి : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-కూచిపూడి : సంక్రాంతి సంబరాలలో నిర్వహించే క్రీడా పోటీలు యువతలో నూతన ఉత్సాహాన్ని, పోటీ తత్వాన్ని పెంపొందింప చేస్తాయని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ స్పష్టం చేశారు. కూచిపూడిపెదపూడి పరిధిలోని పెదసనగల్లు రోడ్డులో గల జిమ్ ప్రాంగణంలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు లీగ్ పద్ధతిన ఫ్లడ్ లైట్ వెలుగులోజరిగే అండర్ 17 బాల బాలికల ఇన్విటేషన్ క్రీడైన కబడ్డీ పోటీలను గురువారం రాత్రి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. గొట్టిపాటి సాయి ఫౌండేషన్ సంక్రాంతి సంబరాల సందర్భంగాపాఠశాలలలోని విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిలో నిబిడీకృతమైన క్రీడా స్ఫూర్తిని వెలికి తీయటానికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ పోటీలలో పాల్గొనటానికి కృష్ణాజిల్లాలోని మొవ్వ, కోసూరు, అవనిగడ్డ, నాగాయలంక,తలగడదీవి, మల్లవోలు, పాఠశాల లతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోని ఆలూరు జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి విద్యార్థినీ విద్యార్థులు పోటీలలో పాల్గొనటానికి రావడం ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతోపాటు వారికి శిక్షణనిచ్చిన పి.డి,పి.ఈ.టిలనుఅభినందించారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొట్టిపాటి సాయి, చిమటా రాఘవేంద్రరావు, కొడాలి మురళి, కటకం పూర్ణచంద్రరావు, వైస్ ఎంపీపీ కందుల కోటేశ్వరరావు, మండల వైకాపా అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం, ప్రతి గింజను కొంటాం

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రతి రైతును ఆదుకుంటామని, రైతు పండించిన ప్రతి ధాన్యాన్ని గిట్టుబాటు ధరతో కొంటామని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గురువారం అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రాజు, గుడివాడ ఆర్డీవో పద్మావతిలు మండల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన వరి పంట ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తి సమాచారం తెప్పించుకుని గిట్టుబాటు ధర వచ్చే విధంగా సీఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలు గంటల వ్యవధిలోనే పరిష్కరిస్తానని అన్నారు. ధాన్యం సంచులు నాసిరకం వస్తున్నందున మంచి సంచులు అందించాలని అలాగే ధాన్యం రైతులదని, డబ్బులు ప్రభుత్వాన్నిదని, పెత్తనం మిల్లర్లదని ఈ విధానం పై ఎమ్మెల్యేగా మీరు దృష్టి సారించి ప్రతి రైతుకు నష్టం లేకుండా మసక బారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇది రైతు ప్రభుత్వం, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం, రైతును రాజుగా గుర్తించటం ప్రభుత్వ లక్ష్యమని, ఎమ్మెల్యే రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వి నాగభూషణం, ఎంపీపీ గోగం సురేష్, వైసీపీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, ఎంపీటీసీ వేమూరి మోహన్, పార్టీలకతీతంగా రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : మండలంలోని కౌతవరం గ్రామము జిల్లా పరిషత్ హై స్కూల్ కాంపౌండ్ లో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి దారపు శ్రీనివాస్ ,మండల తహశీల్దారు అబ్దుల్ రెహమాన్ మస్తానా నిర్వహించిన వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి జిల్లా ప్రభరి ఆఫీసర్ ఎం.రామచంద్రుడు ఐఏఎస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనకు మండల స్థాయి అధికారులు ఘన స్వాగతం పలికారు .ముందుగా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ స్టాల్ ను, ఉజ్వల యోజన స్టాల్ ను, స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐ.సి.డి.యస్), ఆధార్ సేవా కేంద్రంను, వైద్య ఆరోగ్య శాఖ వారి స్టాల్ ను ఆయన వీక్షించారు. అనంతరం రామ చంద్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు అందరు వినియోగించుకోవాలని ప్రజలు మరింత సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలియచేసారు.ఈ కార్యక్రమము లో చిరంజీవి' చెరుకు ద్విగీషా నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమములో మండల విస్తరణాధికారి వి.దిలీప్ కుమార్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి సి హెచ్ ఉమామహేశ్వరరావు , గ్రామ సచివాలయ,పంచాయతీ సిబ్బంది , మరియు, గ్రామ పెద్దలు , పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొనారు.

కబడ్డీ పోటీల్లో వడ్లమన్నాడు జట్టు విజయం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలలో భాగంగా కబడ్డీ పోటీలు 10,11 వ తేదిలలో నిర్వహించడం జరిగినది.ఈ పోటీలలో 17 సచివాలయాల జట్లు షెడ్యూల్ ప్రకారం ఒకదానితో మరొకటి తలపడగా గుడ్లవల్లేరు గ్రామ సచివాలయం 2, వడ్లమన్నాడు గ్రామ సచివాలయాల జట్లు ఫైనల్ లో పోటీ పడగా వడ్లమన్నాడు సచివాలయం జట్టు గుడ్లవల్లేరు సచివాలయం 2 జట్టు పై 06 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.ఈ కార్యక్రమము లో ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీ ఎం .దిలీప్ కుమార్ ,సర్పంచ్ కటికల జ్యోతి ,కొండాలమ్మ గుడి చైర్మన్ శేషం గోపి, వ్యవసాయ మండలి చైర్మన్ పెన్నేరు ప్రభాకర రావు ,మండల పరిషత్ అభివృద్ధి అధికారి దారపు శ్రీనివాస్ ,మండల విస్తరణాధికారి వి.దిలీప్ కుమార్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి సి హెచ్ ఉమామహేశ్వరరావు , గ్రామ సచివాలయ,పంచాయతీ సిబ్బంది , మరియు, గ్రామ పెద్దలు , పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొనారు.

అంగన్వాడీల ఇళ్ళకు సర్కార్ షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : వివిధ డిమాండ్ల నెరవేర్పు కొరకు సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు పంపింది. గత 29 రోజులుగా సమ్మె చేస్తూ విధులకు హాజరు కాకుండా, బాధ్యతలు విస్మరించారంటూ ఉద్యోగం నుండి ఎందుకు తొలగించకూడదో 10 రోజుల్లో సంజాయిషీ తెలపాలంటూ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు నోటీసులు పంపారు. కార్యకర్తలు, సహాయకులు అందుబాటులో లేకపోవడంతో వారి ఇళ్ళకు, అంగన్వాడీ భవనాలకు రెవిన్యూ అధికారులు సదరు నోటీసులను అంటించారు.ఈ నోటీసుల్లో అంగన్వాడీల డిమాండ్లలో ఉద్యోగ గరిష్ట వయోపరిమితి 62 ఏళ్ళకు, పదోన్నతి వయో పరిమితి 45 నుండి 50 ఏళ్ళకు పెంచుతూ, ప్రయాణ, కరవు భత్యంల బిల్లులు నెలవారీ చెల్లింపుకు ఆదేశాలిస్తూ, ఉద్యోగ విరమణ భృతిని లక్షకు పెంచుతూ, నిర్వహణా సామాగ్రి కొనుగోలుకు, భవనాల మరమత్తులకు, విద్యుత్ ఛార్జీల చెల్లింపుకు బడ్జెట్ విడుదల చేస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు, అదేవిధంగా గ్రాట్యుటీపై ప్రభుత్వ మార్గదర్శకాలనుబట్టి నిర్ణయం వుంటుందని, దేశంలోనే ఎక్కు వ గౌరవ వేతనం ఇసున్న ప్రధాన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని, మంత్రుల కమిటీ, కలెక్టర్లు విజ్ఞప్తి చేసినా సమ్మె విరమించకపోవడం వలన ప్రజల ఆహార భద్రత, పోషకాహార లోపాలను అత్యవసరంగా పరిగణించామని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ చర్య పై అంగన్వాడీల తదుపరి కార్యాచరణ ఏ విధంగా ఉంటుందో అని సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

సింగలూరులో రేపు స్వామి వివేకానంద జయంతి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని సింగలూరు గ్రామంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతోత్సవం మరియు జాతీయ యువజన దినోత్సవం ఘనంగా జరుపనున్నామని భాగ్య విధాత ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ తెలిపారు. డాక్టర్ బండారు మట్లాడుతూ 2006 లో పురుడుపోసుకున్న ఆదర్శ గ్రామ తయారీ 18 వ ఏట చక్కగా ముస్తాబైన సింగలూరు ఆత్మీయ మిత్రులకు, శ్రేయోభిలాషులందరికి స్వాగతం పలుకుతోందన్నారు. కీ.శే. బండారు బ్రహ్మారావు,సీతామహాలక్ష్మీ కమ్యూనిటీ హాలు వేదికగా జరిగే ఈ ఉత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుడివాడ డీఎస్పీ పి శ్రీకాంత్, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి కరుణ కుమార్, ఎఎన్నార్ కళాశాల కార్యదర్శి కెఎస్ అప్పారావు, భారత వికాస్ పరిషత్ అమరావతి ప్రాంత అధ్యక్షులు రూప్ చంద్ జైన్, సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ విజయ కుమార్, సర్పంచ్ కె అర్జునరావు తదితరులు పాల్గొంటారన్నారు.

ముదిరాజ్ మహాసభలు విజయవంతం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : గత వారం రోజులుగా ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహిస్తున్న ముదిరాజ్ మహాసభలు విజయవంతం అయ్యాయని ఆంధ్ర ప్రదేశ్ ముదిరాజ్ మహాసభల అధ్యక్షులు కర్ణ నారాయణ అన్నారు. రాష్ట్రంలో ఉన్న ముదిరాజు లను చైతన్య పరచే దిశగా చేపట్టిన ఈ ముదిరాజ్ మహాసభలు మూడు ప్రధాన అంశాలను లక్ష్యంగా తీసుకొని జరపడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ జిల్లా మహాసభల అధ్యక్షులు దుప్పల శివాజీ(క్రేన్ శివాజీ) మాట్లాడుతూ ముదిరాజ్ లను బీసీ డీ నుండి ఏకి మార్చాలని, ముదిరాజులకు ఉభయ సభలోను స్థానం కేటాయించాలని, ముదిరాజులకు 10 సెంట్లు స్థలంలో కమ్యూనిటీ హాల్ను నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లాలో మహాసభలను నేటితో పూర్తయ్యాయని అన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ మరోసారి పునరాలోచన చేసి ముదిరాజులకు సముచిత స్థానాన్ని కల్పించాలని కోరారు. ఏ పార్టీ అయితే ముదిరాజుల సంక్షేమానికి పాటుపడతాయో ఆ పార్టీకి ముదిరాజులంతా సమైక్యంగా కట్టుబడాలని నిర్ణయించుకున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో ముది రాజ్ మహాసభల రాష్ట్ర ప్రధాన కారయదర్శి బోనం వెంకటయ్య ఆంధ్రప్రదేశ్ యూత్ అధ్యక్షుడు కోలా ఏడుకొండలు, జిల్లా ఉపాధ్యక్షులు తోకల రవి ముదిరాజ్,మేకల మోహనరావు, నామాల సుధాకర్,తోకల వెంకటేశ్వరరావు, కంటు మహేష్, ముదిరాజ్ మహిళా అధ్యక్షురాలు తుంగం లలిత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళా హ్యాండ్ బాల్ ఛాంపియన్స్ కేబీఎన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కృష్ణ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల మహిళా హ్యాండ్ బాల్ పోటీలు డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైలవరంలో జరిగిన ఈ పోటీలలో తమ కళాశాల ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఛాంపియన్షిప్ సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. నారాయణరావు తెలియజేశారు. అంతేకాకుండా కృష్ణ యూనివర్సిటీ తరపున సేలం తమిళనాడులో పెరియార్ యూనివర్సిటీ నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా హ్యాండ్ బాల్ పోటీలకు తమ కళాశాల నుండి ఏడుగురు విద్యార్థినిలు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమన్నారు. వీరంతా ప్రధాన జట్టులో ఉండడం కళాశాలకు మరింత పేరు తేచ్చారన్నారు. ఈ ఆట కళాశాల మాతృ ఆటగా గుర్తింపు లభించింది ఎంపికైన వారిలో ఏ రాగ మౌనిక, పి శివాని, జి లలితాశ్రీ, జీ మానస, ఎస్ వెంకటేశ్వరమ్మ, బి జెస్సి, . బి లోకేశ్వరి ఉన్నారన్నారు. విజేతలుగా వీరిని తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పి ఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు తదితర అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలియజేశారు

టాటా ఏఐఏ బిమారత్ డ్రైవ్ విస్తరణ (పీడీఎఫ్)

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాబోయే 2047 నాటికి అందరికీ బీమా అనే ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యానికి మద్దతుగా, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ (టాటా ఏఐఏ) వెస్ట్ బెంగాల్‌లోని అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలు బీమాపై అవగాహన, చొచ్చుకుపోవడానికి అనేక కార్యకలాపాలను నిర్వహించింది. ఈ కార్యకలాపాలలో కంపెనీ శాఖలు, భాగస్వామ్య శాఖలలో ఆన్ గ్రౌండ్ ఈవెంట్‌లు, పౌరులతో ఫోకస్ గ్రూప్ డిస్కషన్‌లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు మరియు రెగ్యులేటర్‌లు, పరిశ్రమ సహచరులతో సమన్వయంతో ప్రత్యేక అవగాహన డ్రైవ్‌లు ఉన్నాయి.

సంస్థకు మంచి పేరు తీసుకురావాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆర్.టి.సి సంస్థకు ప్రతి ఒక్కరూ మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆర్.టి.సి జోనల్ చైర్మన్ పి మహేష్ అన్నారు. బస్ స్టాండ్‌ను, డిపో గ్యారేజిని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబుతో కలిసి మహేష్ సందర్శించి మొక్కలు నాటి డిపో సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్యారేజిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్.టి.సి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా డిపోలో ఇపికె సాధించిన కండెక్టర్లకు, అత్యధిక కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లకు ప్రతిభ కనబరచిన గ్యారేజి సిబ్బందికి చైర్మన్ మహేష్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందచేశారు. డిపో మేనేజర్ కె హనుమంతురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్.టి.సి సీనియర్ నేతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షింతలు పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రతి ఇంటికి అయోధ్య రాముని స్పర్శ అక్షింతలను పంపిణీ చేస్తున్నారు. అవనిగడ్డ 3 వ వార్డులోని కోదండ రామాలయం కేంద్రంగా చేసుకుని గురువారం జిల్లా విశ్వ హిందు పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అయిన బూరగడ్డ శ్రీనాథ్, పల్నాటి వెంకట స్వామి నాయుడు పిలుపు మేరకు అయోధ్య సీతారామచంద్రుల స్పర్శ అక్షింతలు, ప్రతిమ పత్రాలు, ధర్మాచార్య సంపర్గ్ విశ్వ హిందు పరిషత్ పిటివి మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ ఆద్వర్యంలో 2 వ వార్డులో తీన్‌మార్ డప్పులు, మంగళవాయిద్యాలతో ప్రతి ఇంటికి వెళ్ళి అక్షింతలను వితరణగా అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విశ్వ హిందు పరిషత్ లింగం బసవ శంకరరావు, టిటిడి మండల ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు, విశ్వ హిందు పరిషత్ అధ్యక్షులు కమ్మిలి సుబ్రహ్మణేశ్వరరావు, ఆ ప్రాంత భక్త బృందం, గుగ్గులోతు కిరణ్ నాయక్, దివ్యేంద్ర, మహేంద్ర, భూక్య కీర్తి శ్రీ, మేగావత్తు విజయ కుమార్, విశ్వనాధుని హర్ష, కుమార స్వామి, బాలకోటయ్య, బాలాజీ, మురళీ, రాజమోహన్ లతో పాటు పెద్ద ఎత్తున రామ భక్తులు రామనామం చేస్తూ అక్షింతలు పంపిణీ చేశారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో షటిల్, ఖోఖో

విశాలాంధ్ర-కూచిపూడి : "ఆడుదాం ఆంధ్రా"మొవ్వ మండల స్థాయి పోటీలలో భాగంగారెండవ రోజైన గురువారం బాల బాలికల విభాగంలోషటిల్, పురుషుల విభాగంలోఖోఖో పోటీలను నిర్వహించారు ఈ పోటీలలో షటిల్. విభాగానికి 22 జట్లు తలపడగా,,ఖోఖో పోటికి ఐదు జట్లు తరలివచ్చాయని మొవ్వ-1 సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ (గ్రేడ్ 5 కార్యదర్శి ఇంచార్జ్) అవనిగడ్డ మహేష్ తెలిపారు. షటిల్ లో కాజ-1 వెర్సెస్ కూచిపూడి, ఖోఖో లో అయ్యంకి వర్సెస్ కూచిపూడి టీములు ఫైనల్ కు చేరినట్లు, ఈ జట్లకు ఈనెల 23వ తారీఖున పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. శుక్రవారం వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు ఫిజికల్ డైరెక్టర్లు, పి .ఈ.టి.లు, పలు పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరైనారు.

కిరణ్ కుటుంబానికి రూ.9 లక్షల ఆర్థిక సాయం : వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్త మెండెంపూడి కిరణ్ కుటుంబానికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఎన్నారై టిడిపి తరపున గురువారం రూ. 9లక్షల 38 వేలరూపాయల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ అడుసుమిల్లి కృష్ణప్రియ, గుత్త గంగాధర్‌లతో కలసి వెనిగండ్ల రాము మాట్లాడుతూ కిరణ్ కుమార్తె చదువుకు తమ వంతు సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లింగం ప్రసాద్, కొల్లి సుధాకర్, అందుగుల యేసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రంగవల్లులు పోటీలు

విశాలాంధ్ర-గుడివాడ : తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో గురువారం ధూళిపాల శేషగిరి తల్లి, కొడాలి విజయభారతి స్మార్కార్థం షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో రంగవల్లులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయ పరిరక్షణకు తెలుగు భాషా వికాససమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం రంగవల్లు పోటిలలో విజేతకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపర్తి సునీత, కుమారి పూర్ణిమ, సంధ్య, గ్రంథాలయ అధికారి భీరం వెంకటరమణ, డిఆర్‌బి ప్రసాద్, కొడాలి రామ్మోహనరావు, గాదె మోహన్‌బాబు, భబిత, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు

దళిత బంధు సంక్షేమ వైస్ చైర్మన్‌గా వీర్రాజు

విశాలాంధ్ర-అవనిగడ్డ : పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ దళిత బంధు సంక్షేమ అభివృద్ధి బోర్డు వైస్ చైర్మన్ గా తెలుగు ప్రముఖుడు ఇ వీర్రాజుని నియమించడం పట్ల మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వీర్రాజు ప్రథమ తెలుగు మహా సభల్లో మా తండ్రి గారైన మండలి వెంకట కృష్ణారావులతో కలిసి పని చేశారని, విజయవాడలో నిర్వహించిన తెలుగు మహా సభలకు హాజరైయ్యారని, పశ్చిమ బెంగాల్ తెలుగు సభలకు పెద్ద దిక్కుగా ఉన్న వీర్రాజును గుర్తించి పశ్చిమ బెంగాల్ దళిత బంధు సంక్షేమ అభివృద్ధి బోర్డు వైస్ చైర్మన్‌గా నియమించిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

జోరుగా ఆడుదాం ఆంధ్రా క్రీడలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడలు జోరుగా జరుగుతున్న తరుణంలో వాలీబాల్ పోటీలను గురువారం ఎం.పి.పి తుంగల సుమతీదేవి ప్రారంభించారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలలో భాగంగా ప్రభుత్వ డిగ్రి కళాశాలలో జరుగుతున్న పోటీలలో వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా ఉరకలు వేస్తూ జరుగుతున్నాయి.

ఎస్.వి.ఎల్‌లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎస్.వి.ఎల్ విద్యా సంస్థలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సంక్రాంతి పర్వదినానికి మరో 3 రోజుల వ్యవధి ఉన్నప్పటికి ముందుగానే సంక్రాంతి సంబరాలు విద్యా సంస్థల డైరెక్టర్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆద్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించగా ఈ సంక్రాంతి సంబరాలకు శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఎద్దుల బండిపై ఊరేగింపుగా తీన్‌మార్ డప్పులతో, సాంప్రదాయ దుస్తులతో విచ్చేసి ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు, కోడి పందాలు, గాలి పటాలు, వంటి తదితర కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు పెద్ద ఎత్తున పాలు పొంగళ్ళ కార్యక్రమం, పిండి వంటలు నిర్వహించగా, కళాశాల విద్యార్ధిని విద్యార్థులు, కల్చరల్ ప్రోగామ్‌ను ఏర్పాటు చేయగా పలువురు గోదాదేవి అమ్మవారి వేషధారణలో దర్శనం ఇవ్వగా సాంప్రదాయ పండుగలలో సంక్రాంతి ఒక ముఖ్యమైన పండుగ అని చెప్పి సంక్రాంతి విశిష్ఠతను సింహాద్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.వి నాగేశ్వరరావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గోని సాంప్రదాయ దుస్తులలో ఆట పాటలతో అంబరాన్ని అంటేలా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

నేడు గీతామందిరంలో కూడారై మహోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా 27 వ రోజు శుక్రవారం కూడారై పాశు రా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ చైర్మన్ యర్రంశెట్టి శ్రీహరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు 108 గంగాలంలతో నేతి ప్రసాదాలు భక్తులచే ప్రత్యేకంగా నివేదన చేయబడుతుందన్నారు. స్వామి వారి కార్యక్రమాలలో పాల్గోని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు.

దేశం అభివృద్ధే లక్ష్యం : భగవాన్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అవినీతి,ఆర్థిక నేరాలను నియంత్రించి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే జై మహ భారత్ పార్టీ స్థాపించామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు భగవాన్ సిరి అనంతవిష్ణు దేవ ప్రభు తెలిపారు.గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ మేనిఫెస్టో విడుదల చేశారు.అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ దేశంలో పెట్రోల్,డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించి సోలార్, ఎలక్ట్రికల్ ఇతర సాంప్రదాయ శక్తితో నడిచే వాహనాలను రూపొందించి ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తామన్నారు. అదేవిధంగా ప్రకృతి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దుతామన్నారు.నదుల అనుసంధానం,వ్యవసాయ రంగం అభివృద్ధి,ఉచిత విద్య,వైద్యం, అందిస్తామన్నారు.అవినీతి పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పి జై భారత్ పార్టీని గెలిపించాలని కోరారు.పార్టీ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ కాట్రగడ్డ సత్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని గ్రామాలలో నాణ్యమైన రోడ్లు నిర్మించి,రవాణా వ్యవస్థను మెరుగుపరచడం. పెరుగుతున్న ధరలను నియంత్రిచడం మద్యపాన నిషేధం, భూలక్ష్మి పథకం కింద మహిళలకు 100 చదరపు గజాలు భూమి,ధనలక్ష్మి పథకం కింద పావలా వడ్డీ కి రుణాలు,50 రూపాయలకే గోబర్ గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పారు.అక్రమాలు అన్యాయాలు,అత్యాచారాలు, నేరాలపై,ఉక్కు పాదం మోపి శాంతియుత, సురక్షితమైన సమర్థవంతమైన పాలనను రాష్ట్రంలో అందిస్తామని రాష్ట్ర ప్రజలందరూ జై మహ భారత్ పార్టీని బలపరచాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గిద్ద శ్రీనివాసరావు. కాపునాడు రాష్ట్ర కన్వీనర్, తుమ్మ సత్యనారాయణ, సత్య తదితరులు పాల్గొన్నారు.

'ఓలా'లో 15 వేలు హార్వెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లు

విశాలాంధ్ర-విజయవాడ: : సంక్రాంతి పండుగ ప్రారంభానికి గుర్తుగా 'ఓలా' ఎలక్ట్రిక్ రూ. 15 వేలు వరకు విలువైన హార్వెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్ జనవరి 15వ తేదీ వరకు అమలులో ఉంటుంది. ఈ ఆఫర్‌లో భాగంగా ఎస్1 ప్రో, ఎస్1 ఎయిర్ కొనుగోలుపై రూ. 6,999 వరకు పొడిగించిన బ్యాటరీ వారంటీ, రూ. మూడు వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్, ఆకర్షణీయమైన ఫైనాన్స్ డీల్‌లు ఉన్నాయి. అదనంగా ఎస్1 ఎక్స్‌ం ఫ్లాట్ రూ.20 వేల తగ్గింపుతో రూ. 89,999 వద్ద అందుబాటులో ఉంటుంది. క్రెడిట్ కార్డ్ ఈఎంఐతో రూ.5 వేల వరకు తగ్గింపును పొందవచ్చు. ఓలా ఎలక్ట్రిక్ పోర్ట్‌ఫోలియోను ఐదు ఉత్పత్తులకు విస్తరించింది. ఎస్1 ప్రో (2వ తరం) ధర రూ. 1,47,499 కాగా, ఎస్1 ఎయిర్ ధర రూ. 1,19,999.. అదనంగా ఎస్1ఎక్స్ మూడు వేరియంట్‌లలో పరిచయం చేసింది. ఎస్1 ఎక్స్‌ం, ఎక్స్1 ఎక్స్ (3కేడబ్ల్యుహెచ్), ఎస్1 ఎక్స్ (2కేడబ్ల్యుహెచ్) రైడర్‌ల అవసరాలను తీర్చనుంది. ఎస్1 ఎక్స్ (3కేడబ్ల్యుహెచ్), ఎస్1 ఎక్స్ (2కేడబ్ల్యుహెచ్) కోసం రిజర్వేషన్ విండో రూ. 999 వద్ద ఉంది. ఇది వరుసగా రూ. 99,999, రూ. 89,999 ప్రారంభ ధరలో అందుబాటులో ఉంటుంది.

టీడీపీని విమర్శిస్తే ఊరుకోం : రామినేని

విశాలాంధ్ర ఇబ్రహీంపట్నం : మాజీ పార్లమెంటు సభ్యులు కేసినేని నాని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు లోకేష్ గార్లపట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పార్టీ మారడాన్ని ఇబ్రహీంపట్నం మండల పార్టీ అధ్యక్షులు రామినేని రాజా తీవ్రంగా తప్పుపట్టారు. మరి ఎవరైనా తెలుగుదేశం పార్టీ పట్ల పిచ్చికుక్కలా వాగితే నాలుకలు కోస్తామన్నారు. కేశినేని రెండుసార్లు తెలుగుదేశం పార్టీ బీ ఫారం ఇస్తే గెలిచి నేడు అధిష్టానం పై జగన్ మోహన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత పై పిచ్చికుక్కలాగా వాగుతున్నాడనీ నీలాంటివారు పార్టీ నుండి వెళ్లినా పార్టీకి వచ్చే నష్టమేమీ లేదు. ప్రతి ఎన్నికల సమయంలోనూ ఆయా రామ్ లు గయా రామ్ లు ఉంటారని నువ్వు కూడా అందులో ఒకడివని నువ్వు పార్టీ నుండి వెళ్లడాన్ని చాలెంజ్గా తీసుకొని పార్లమెంటు స్థాయిలో లక్షకు పైగా మెజార్టీతో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకుమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

రేపటి నుండి మండలస్థాయి ఖో ఖో, బ్యాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ఖో-ఖో మరియు బాడ్మింటన్ ఆటల పోటీలు మండలం లో గల 17 సచివాలయాలకు సంభందించి రేపు ఉదయం 8.30 గం లకు శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రారంభించనున్నామని గుడ్లవల్లేరు మండల ప్రజాపరిషత్ అధికారి దారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.